www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 9 డిసెంబర్ 2025

5



నాయక్‌కు ఉత్తమ ఫిజియోథెరపిస్ట్ అవార్డు

ప్రజాశక్తి - అంబాజీపేట

స్థానిక డాక్టర్ హనుమ నాయక్ ఉత్తమ ఫిజియోథెరపిస్ట్ అవార్డును అందుకున్నారు. గత కొన్నేళ్లుగా శ్రీలక్ష్మి అడ్వాన్స్‌డ్ లేజర్ ఫిజియోథెరపీ రిహాబిలిటేషన్ హాస్పిటల్‌ను స్థాపించి ఎంతో మందికి వైద్య సేవలు అందించి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా అమలాపురం కిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎసిపిఎఆర్‌సిలో ఆయన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. గత పదేళ్లుగా వైజాగ్, రాజమహేంద్రవరం, ఏలూరు, రావులపాలెం, అంబాజీపేట, పి.గన్నవరం ప్రాంతాల్లో ఫిజియోథెరపీ సేవలను అందించినట్లు నాయక్ తెలిపారు.


అవార్డు అందుకుంటున్న హనుమనాయక్

కొండెక్కిన కోడిగుడ్డు..!

- కొన్నేళ్లతో పోల్చితే రికార్డు ధర
- పౌల్ట్రీ నిర్వాహకులకు ఊరట
- వినియోగదారులకు చుక్కలు

ప్రజాశక్తి - రాజోలు

గుడ్డు వెరి గుడ్ అనేవారు కానీ.. కోడిగుడ్డు ధర పెరుగుదలతో వెరీ బ్యాడ్ అనే పరిస్థితి వచ్చింది. మాంసాహారం భుజించలేని సామాన్యులకు గుడ్డు అందుబాటులో ఉండేది. కానీ గుడ్డు ధర అమాంతంగా పెరుగుదల చికెన్ ధరను చేరుకుంటుంది. ప్రతి ఏడాది కార్తీకమాసంలో గుడ్డు ధర తక్కువగా ఉండేది. ఎందుకంటే ఈ మాసంలో శాకాహారులు ఎక్కువగా ఉంటారు. దీంతో ఎప్పుడూ గుడ్డు ధర తక్కువగా ఉండేది. అయితే దానికి భిన్నంగా ఈ ఏడాది మాత్రం గుడ్డు ధర పరుగులు పెడుతోంది. కోళ్ల ఫారాల నిర్వాహకులకు లాభాలు పండిస్తుంటే సామాన్యుడు మాత్రం గుడ్డు తినలేని పరిస్థితి కనిపిస్తోంది.

గత రెండేళ్ల పాటు పౌల్ట్రీ పరిశ్రమ ఒడిదుడుకులు చెందగా ఇప్పుడిప్పుడే పరిశ్రమ కుదుటపడుతోంది. గతంలో పరిశ్రమ నష్టాల కారణంగా చాలా మంది రైతులు కోళ్ల ఫారాలను మూసివేశారు. కొంతమంది అయితే బ్యాచ్‌లు వేయలేదు. గతంలో అయితే బ్యాచ్‌లు వేసి గుడ్లు ఉత్పత్తి చేసేవారు. ప్రస్తుతం ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్‌కు సరిపడా సరుకు లేకపోవడంతో ధరలు పెరుగుదలకు కారణమని నిర్వాహకులు చెబుతున్నారు. ఒక గుడ్డు ఉత్పత్తికి రూ.4.80 పైసలు ఖర్చు అవుతుంది. రూ.5 దాటి ధర ఉంటేనే గిట్టుబాటు ఉంటుందని పౌల్ట్రీ రైతులు అంటున్నారు.


పౌల్ట్రీలకు గుడ్డు ధర ఊరట

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 300 వరకు కోళ్ల ఫారాలు ఉన్నాయి. వీటిలో 1.40 కోట్ల మేర కోళ్లను పెంచుతున్నారు. రోజుకు 1.10 కోట్ల మేర గుడ్లు ఉత్పత్తి జరుగుతోంది. 40 శాతం స్థానిక అవసరాలకు వినియోగిస్తుండగా 60 శాతం గుడ్లు పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, బిహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ప్రభుత్వం అంగన్‌వాడీలు, పాఠశాలలు, వసతిగృహాలు, ఆస్పత్రుల్లో గుడ్లను సరఫరా చేస్తుంది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, ఇంట్లోని వంటకాల్లో కూరలకు గుడ్లు విరివిగా వాడుతున్నారు. గుడ్డు భలే ఫుడ్ అన్నట్టుగా మారింది. డిమాండ్‌కు తగ్గట్టుగా గుడ్ల ఉత్పత్తి లేకపోవడంతో పాటు శీతాకాలం కావడంవల్ల వినియోగం పెరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు. కొన్నేళ్లుగా కోళ్ల పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోగా ఇప్పుడు కాస్తంత పెరిగిన గుడ్డు ధర ఊరటనిస్తోందని పౌల్ట్రీ నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.

గత ఏడాది గుడ్డు ధర రూ.5.87

కార్తీకమాసంలో కాయగూరల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కనీసం గుడ్డు కొనుగోలు చేసి కూర వండుకుందామంటే బయట రూ.7 నుంచి రూ.8 వరకు విక్రయిస్తున్నారు. గతేడాది నవంబరులో గుడ్డు ధర రూ.5.87 ఉండగా ఈ ఏడాది ప్రస్తుతం రూ.6కి చేరింది. చిల్లరగా గుడ్డు ధర బయట మార్కెట్‌లో రూ.6.50 నుంచి రూ.7లకు వరకు విక్రయిస్తున్నారు. మొత్తం మీద కార్తీకంలో గుడ్డు ధర నిర్వాహకులకు ఊరటనిస్తుంటే కొనుగోలు దారులకు మాత్రం నీరసం కలిగిస్తోంది.

రాయితీలు కల్పించాలి

పరిశ్రమలో కోళ్లకు వాడే మేతల ధరల పెరుగుదల, మందుల ధరలు పెరగడం భారంగా మారిందని నిర్వాహకులు చెబుతున్నారు. కోళ్ల మేతలకు సంబంధించి ముడిసరుకు ధరలు పెరగడం తమకు భారంగా మారాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 2019లో ముడిసరుకు ధరలు తక్కువ ఉండడం వల్ల లాభాలు వచ్చాయని, ప్రస్తుతం పెరిగిన దాణా ధరలు భారంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన యుపి, వెస్ట్ బెంగాల్, ఒడిసా తదితర రాష్ట్రాల్లో సబ్సిడీలు ఇస్తుండగా ఇక్కడ మాత్రం ఇవ్వడం లేదు. దానివల్ల ఇక్కడ రైతులు మార్కెట్ ధరపైనే ఆధారపడాల్సి వస్తోంది. పొరుగు రాష్ట్రాల్లా ఇక్కడా ప్రభుత్వం కోళ్ల పరిశ్రమలకు రాయితీలు కల్పించాలని, ముడిసరుకు ధరల నియంత్రణకు చర్యలు తీసుకుని ఆదుకోవాలని పౌల్ట్రీ నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.


ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

నిందితుని బెయిల్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

10 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు రాయపురెడ్డి సత్యవెంకటకృష్ణకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంపై ప్రజా సంఘాల ఐక్యవేదిక నిరసన వ్యక్తం చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. నిందితుడి బెయిల్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐక్యవేదిక నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ నిందితుడికి బెయిల్ రావడంతో బాలిక కుటుంబం భయాందోళనకు గురౌతున్నారని అన్నారు. అతను బయట ఉంటే కేసు విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉందని అన్నారు. నిందుతుడిని కేసు నుంచి తప్పించేందుకు కొంత మంది ప్రజా ప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కలెక్టర్, ఎస్‌పి స్పందించి తక్షణం బెయిల్ రద్దుచేసి నిందుతుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాలిక చదువు మధ్యలోనే ఆగిపోవడం జరిగిందని, కావున ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విద్యా సంస్థలో బాలికను జాయిన్ చేయాలని కోరారు. బాలిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిల్లెల్ల మనోహర్, అమలదాసు జాన్‌బాబు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడిద రాజేష్, పిడిఎం రాష్ట్ర నాయకులు దీపాటి శివప్రసాద్, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు, దేవినాగలక్ష్మి, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జి.దైవకృప, చీకురుమెల్లి కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'1వ తేదీనే జీతాలు చెల్లించాలి'

ప్రజాశక్తి - అమలాపురం

ప్రతీ నెలా 1వ తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలను చెల్లించాలని మాజీ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగుల విషయంలో 1వ తేదీనే జీతాలు చెల్లిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఈ నెల జీతాలు నేటికీ చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వేసే పరిస్థితి నుంచి 8వ తేదీ వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. న్యాయ, రెవెన్యూ, పోలీసు, ఖజానా శాఖల వారితో పాటు మరికొన్ని శాఖలకు ఈ నెల జీతాలను ప్రభుత్వం చెల్లించిందని, అయితే వ్యవసాయ, బిసి, ఎస్‌సి వెల్ఫేర్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలు వంటి తదితర శాఖల ఉద్యోగులకు నేటికీ జీతాలు చెల్లించలేదన్నారు. దీంతో వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు, విద్యా రుణాలు వంటి ఇఎంఐలను చెల్లించలేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతీ నెల 5వ తేదీనే బ్యాంకులకు చెల్లించాల్సిన ఇఎంఐలు చెల్లించకపోవడంతో ఉద్యోగుల సిబిల్ స్కోర్‌పై ప్రభావితం పడుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రతినెల ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

త్రీవీలర్ సైకిల్ బహూకరణ

ప్రజాశక్తి - సఖినేటిపల్లి


ట్రై సైకిల్‌ను అందజేస్తున్న అమూల్య

మండలంలోని కేశవదాసుపాలెం గ్రామానికి చెందిన మండ కొండలరావుకు టిడిపి రాజోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి అమూల్య బహూకరించారు. సోమవారం కొండలరావు ఇంటికి స్వయంగా వెళ్లి తన సొంత నిధులతో సమకూర్చిన త్రీ వీలర్ సైకిల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఈ నెల 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 4 వరకూ విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సూర్యనారాయణ పిలుపు నిచ్చారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు మండల నాయకుడు నిమ్మకాయల వెంకటేష్ అధ్యక్షతన కార్మికులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు అఖిల భారత మహాసభల్లో పాల్గొనేందుకు 20 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. చివరి రోజున లక్షలాది మందితో బీచ్ రోడ్‌లో భారీ ప్రదర్శన నిర్వహించి, అనంతరం బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. బహిరంగ సభకు కార్మికవర్గం పెద్దఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు విత్తనాల రాంబాబు, పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, పలివెల ప్రసాద్, జి.హైమావతి, కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

కోటి సంతకాలకు విశేష స్పందన : బొత్స

ప్రజాశక్తి - రావులపాలెం

వైద్య విద్య ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని శాసన మండలి ప్రతిపక్ష నేత, వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యానారాయణ అన్నారు. సోమవారం స్థానిక సిఆర్‌సిలో వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం దారుణమన్నారు. ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాల ప్రతులను ఈ నెల 17వ గవర్నర్‌ను కలిసి అందజేస్తామని అన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని, అయితే దురదృష్టవశాత్తూ కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. అదే జరిగితే ప్రజలకు వైద్యం మరింత ఖరీదు అవుతుందని అన్నారు. కోటి సంతకాల ప్రతులను ఈ నెల 10వ తేదీన జిల్లాల కేంద్ర కార్యాలయాలకు తరలిస్తామని చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

15వ తేదీన జిల్లాల నుంచి సంతకాల పేపర్లను పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తరలిస్తామన్నారు. ఇండిగో విమానాల సంక్షోభంతో ప్రపంచంలో దేశం పరువు తీశారని, ఒక వ్యక్తి తప్పిదం వల్ల ఈ సంక్షోభం ఏర్పడిందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, గొల్లపల్లి సూర్యారావు, జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంఎల్‌సిలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయెల్, మాజీ ఎంపి చింతా అనూరాధ, మాజీ ఎంఎల్‌ఎలు జక్కంపూడి రాజా, పొన్నాడ సతీష్, పాముల రాజశ్వరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు పితాని బాలకృష?, జిల్లా పర్యవేక్షకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల నిరసన

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సహకార ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఎపి వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక(జెఎసి) పిలుపు మేరకు సోమవారం జిల్లాలోని పలు పిఎసిఎస్‌ల వద్ద ధర్నాలు జరిగాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

అమలాపురం స్థానిక డిసిసిబి బ్రాంచ్ వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, 2019 వేతన సవరణ వెంటనే చేపట్టి సిబ్బందికి వేతనాలు పెంచాలని, 2019 తరువాత పిఎసిఎస్‌లో చేరిన వారిని పర్మినెంట్ చేయాలని, జిఒ 36 అమలు చేయాలని, సొసైటీల లాభనష్టాలతో సంబంధం లేకుండా జీతాలు ఇవ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్‌ల సిఇఒలు టి.దొరాజి, పి.దుర్గాప్రసాద్, ఎల్.సూర్యనారాయణ, వివిఎస్. శ్రీనివాసరావు, వై.శివ, బి.సత్యనారాయణ, టి.శ్రీనివాసరావు, సుధీర్, వై.కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. **పి.గన్నవరం** స్థానిక డిసిసిబి బ్రాంచి కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. బ్రాంచ్ మేనేజర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సిఇఒలు, సిబ్బంది పాల్గొన్నారు. **మామిడికుదురు** మామిడికుదురులోని డిసిసిబి బ్రాంచ్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. బ్రాంచ్ మేనేజర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మామిడికుదురు, పాశర్లపూడి, అప్పనపల్లి, పాశ ర్లపూడిలంక, ఈదరాడ పిఎసిఎస్‌ల ఉద్యోగులు పాల్గొన్నారు. **అంబాజీపేట** స్థానిక డిసిసిబి బ్రాంచ్ కార్యాలయంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ, ఉద్యోగులు, సిబ్బవంది పాల్గొన్నారు. **ముమ్మిడివరం** స్థానిక డిసిసిబి బ్రాంచ్ కార్యాలయం వద్ద మండలంలోని పలు పిఎసిఎస్‌ల ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్‌ల సిఇఒలు శివప్రసాద్, జయరాం, మణికంఠకుమార్, బుజ్జి, సత్యనారాయణ, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** స్థానిక డిసిసిబి బ్రాంచ్ కార్యాయం వద్ద సహకార ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ శర్మకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ యూనియన్ డైరెక్టర్ ఆకుల సూర్యప్రభాకరరావు, సిఇఒలు చిక్కం లింగయ్య నాయుడు, మంచెం బాబి, కూసంపూడి శ్రీనివాసరాజు, ఆకుల వీర గణేష్, నాగులపల్లి సతీష్, పోలిశెట్టి దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


అమలాపురంలో ధర్నా చేస్తున్న సొసైటీ ఉద్యోగులు


పి.గన్నవరంలో ధర్నా చేస్తున్న సొసైటీ సిఇఒలు


మామిడికుదురులో ధర్నా చేస్తున్న ఉద్యోగులు


అంబాజీపేటలో ధర్నా చేస్తున్న సొసైటీ ఉద్యోగులు

ఇండిగో సమస్యకు త్వరలో పరిష్కారం

ప్రజాశక్తి - కొత్తపేట

దేశంలో ఏర్పడిన విమానయాన సంస్థ సంక్షోభం త్వరలోనే పరిష్కారం అవుతుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విమానయాన సమస్యపై మంత్రి నారా లోకేష్ కేంద్రానికి సూచనలు చేయడంపై వైసిపి నాయకులు చేస్తున్న విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆ సంస్థ 650 విమానాలను నడిపిందని, పరిస్థితి నెమ్మదిగా గాడిన పడుతుందన్నారు. జాతీయ సమస్యల పట్ల అవగాహన పెంచుకుని, సమస్య పరిష్కారం కోసం మంత్రి లోకేష్ కేంద్ర దృష్టికి కొన్ని సూచనలు చేస్తే, వైసిపి నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి జోగి రమేష్ మద్యం అవినీతి కేసులో అడ్డంగా దొరికిపోయాడని, అటువంటి వ్యక్తి కోసం నేడు వైసిపి నాయకులు కులాన్ని ఆపాదించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు.

డెంగీ కేసు నమోదు..

ప్రజాశక్తి - రామచంద్రపురం, ఉప్పలగుప్తం

రామచంద్రపురంలోని అంకంవారి వీధిలో డెంగీ కేసు నమోదు అయింది. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు డెంగీ కేసు నమోదైన ఇంటిని పరిశీలించారు. అనంతరం సిబ్బంది డోర్ టు డోర్ సర్వే నిర్వహించారు. డెంగీ వ్యాధి నిర్మూలన కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం రాయుడు సుధారాణి, ఎంపిహెచ్‌ఒ కామేశ్వరరావు, ఆశ వర్కర్ రాణి పాల్గొన్నారు. అలాగే ఉప్పలగుప్తం మండలంలోని భీమనపల్లి పిహెచ్‌సి పరిధిలోని భట్టుపాలెంలో డెంగీ కేసు నమోదు అయింది. దీంతో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.విష్ణుప్రియ ఆధ్వర్యంలో గ్రామంలో మూడు బృందాలతో ఇంటింటా సర్వే చేపట్టారు. సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మలేరియా యూనిట్ ఆఫీసర్ పి.రాజ్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి ఆర్.రామకృష్ణ, పర్యవేక్షకులు సత్యవతి, శ్రీవల్లి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న మలేరియా అధికారి వెంకటేశ్వరరావు

పంట కాలువ గట్ల పటిష్టతకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు


కాలువ పనులను పర్యవేక్షిస్తున్న శ్రీనివాస్

మండలంలోని చింతలూరు, ఆలమూరు పంటకాలువ గట్ల పటిష్టతతో పాటు పరిశుభ్రతకు చింతలూరు నీటి సంఘం అధ్యక్షులు గారపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం చర్యలు చేపట్టారు. తన నిధులతో భారీ ప్రొక్లైన్ ఏర్పాటుచేసి పంట కాలువలోని గుర్రపు డెక్క, తూడు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగింపులతోపాటు గట్ల విస్తరణ పనులు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలవ గట్టు ఆనుకుని ఉన్న రైతులు గట్లను ఆక్రమించుకోకుండా పంట సాగు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇందుకు ప్రతి రైతు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు నీటి సంఘం అధ్యక్షుడు వైట్ల గంగరాజు, నేతలు వైట్ల శేషుబాబు, గన్ని వెంకట్రావు, ఇరిగేషన్ అధికారి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం


గురుకుల పాఠశాల విద్యార్థిని బయటకు వెళ్ళడానికి కారణమైన పాఠశాల యాజమాన్యాన్ని తక్షణమే విధుల నుంచి తొలగించాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ కోరారు. సోమవారం జరిగిన పిజిఆర్‌ఎస్‌లో ఆయన వినతిపత్రాన్ని అందజేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల అనుమతి లేకుండా అపరిచిత వ్యక్తులతో విద్యార్థినిని బయటకు పంపడం దారుణమన్నారు. ఈ ఘటనలో ప్రిన్సిపల్, హౌస్ టీచర్, సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కన్పిస్తుందన్నారు. కావున ఇందుకు కారకులను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

11న మాదిగల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - అమలాపురం

ఈ నెల 11న స్థానిక కొంకాపల్లి సత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో మాదిగల ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ సామాజికవర్గానికి చెందిన అందరూ మాదిగల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ రవీందర్, మడికి శ్రీరాములు, బడుగు శ్రీను, పలివెల మోహన్‌రావు, పలివెల నాగేంద్రప్రసాద్, ఆకుమర్తి దుర్గారావు, ఆనంద్‌శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



మురుగు కాలువల పనితీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని మేజర్, మైనర్ మురుగు కాలువల పనితీరుపై పలువురు ప్రజాప్రతినిధులు, పిఎసిఎస్ ఛైర్మన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దంగేటి వీరఅచ్చుత జానకి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాలువల ఆధునికీకరించక పోవడంపై ఇరిగేషన్ అధికారులను నిలదీశారు. మురుగు కాలువల్లో తూడు పెరిగి పోవడంతో ముంపు నీరు పారడం లేదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే క్రాఫ్ హాలిడే ప్రకటించవలసి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత డ్రెయిన్స్ ఎఇ సమావేశానికి హాజరు కాకపోవడం పట్ల వారు మండిపడ్డారు. మురుగు కాలువల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని ఎంపిడిఒ కృష్ణ హామీ ఇచ్చారు. సమావేశంలో వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నీటి సంఘాల అధ్యక్షులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వీరఅచ్చుత జానకి

11న ఎంపిపి ఎన్నిక

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల పరిషత్ అధ్యక్షుని ఎన్నిక ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో నిర్వహించనున్నట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, డిడిఒ వి.విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈ ఎన్నికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి ఈ ఏడాది అక్టోబర్ 13న తన పదవికి రాజీనామా చేశారని తెలిపారు.


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

హోండాయ్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - అమలాపురం

ప్రముఖ హోండాయ్ కంపెనీ స్థానికంగా ఏర్పాటు చేసిన లక్ష్మి హోండాయ్ షోరూమ్‌ను సోమవారం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. అత్యాధునిక సౌకర్యాలతో కస్టమర్లకు అత్యంత విలువయిన సౌకర్యాలను అందిస్తుందని హోండాయ్ యాజమాన్యం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ హోండాయ్ ఛైర్మన్ కంభంపాటి రామ్మోహన్‌రావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అమ్మడా ఛైర్మన్ అల్లాడి స్వామినాయుడు, కిమ్స్ విద్యా సంస్థల ఛైర్మన్ కలిదిండి చైతన్యరాజు, మునిసిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, నాయకులు గంధం పల్లంరాజు, మోకా సుబ్బారావు, గోపాలకృష్ణంరాజు, జగ్గపురాజు, నల్లా పవన్, నల్లా శ్రీధర్, ఆర్‌డిఎస్ ప్రసాద్, రాజమహేంద్రవరం ఆపరేషన్ హెడ్ సునీల్‌కుమార్, సేల్స్ మేనేజర్ సత్యమూర్తి పాల్గొన్నారు.

అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ

ప్రజాశక్తి - అమలాపురం

ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారించి అర్జీదారులకు సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలను ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై అర్జీదారులు 265 వినతిపత్రాలను అధికారులకు అందజేశారు. ఆయా అర్జీలను నిర్దేశిత గడువులోగా త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు పెట్టుకున్న వారికి సంతృప్తికర పరిష్కారం చూపాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జిదారులతో సంబంధిత అధికారులు నేరుగా మాట్లాడాలని చెప్పారు. సరైన రీతిలో ఎండార్స్‌మెంట్లు ఇవ్వాలని, అర్జీదారులతో అధికారుల ప్రవర్తన విషయంలో మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చేలా చిత్తశుద్ధి, క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. ఫిర్యాదుల ఆడిటింగ్ సక్రమంగా పూర్తి చేయాలని అన్నారు. అర్జీదారుల నుంచి వచ్చిన ప్రతి ఫీడ్ బ్యాక్‌ను నిశితంగా పరిశీలించి సంబంధిత అధికారికి సూచనలు ఇవ్వాలన్నారు. జాయింట్ కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ రీ ఓపెన్ చేసిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టిసారించి, త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. వివిధ అంశాలకు సంబంధించిన అర్జీల పరిష్కారంలో సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. విజన్ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక యూనిట్ క్రియాశీలతకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కె.మాధవి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సమగ్ర శిక్ష ఎపిసి జి.మమ్మీ, డిఎల్‌డిఒ రాజేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

నేరాలు ఘోరాలు

యువకుని అదృశ్యం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం చిక్కాల గ్రామానికి చెందిన గంగుల మధు(27) ఈనెల 6వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆరోతేదీ సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో ఇంటి నుంచి బైకుపై వెళ్లిన ఆయన తిరిగి ఇంటిరి రాలేదు. అతని కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె తల్లి గంగుల వరలక్ష్మి పోలీసులు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర తేలిపారు. ఆచూకీ తెలిస్తే 9440796662, 9154875597 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రెండిళ్లలో చోరీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాపవరం గ్రామానికి చెందిన పిల్లి శ్రీనివాస్ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో రూ.10 వేలు నగదు, ఎనిమిది రూపులతో లక్ష్మీదేవి నల్లపూసల దండ, పది తులాల వెండి పట్టీలు పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా వారి ఇంటి పక్కన ఉన్న నరాల సత్యనారాయణ ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ద్రాక్షారామ ఎస్ఐ ఎం. లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి, సిఐ

హత్య కేసులో ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట, కిర్లంపూడి

కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో కాకర అప్పారావు హత్య కేసులో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు తెలిపారు. జగ్గంపేట సర్కిల్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నవంబర్ 5న భూపాలపట్నంలో అప్పారావును కుళ్ళ రాజిబాబు, నాగేశ్వరరావు హత్య చేసి పరారీలో న్నారన్నారు. రాజిబాబును జగ్గంపేట మండలం రామవరం వద్ద సోమవారం అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. అప్పారావుపై ఉన్న కక్షతో తన తమ్ముడు నాగేశ్వరరావుతో కలిసి ఇనుప రాడ్లతో కొట్టి చంపినట్లు రాజిబాబు ఒప్పుకున్నాడని తెలిపారు. పరారీలో ఉన్న నాగేశ్వరరావు కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఉన్నారు.


పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

మండపేట విలీనం పట్ల హర్షం

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం

మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక బ్యాంకు కెనాల్ లాకుల వద్ద నీటి వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్‌కల్యాణ్, ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గాన్ని విలీనం చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూళ్ళ సాగునీటి సంఘం అధ్యక్షుడు ఎ.గోపాలకృష్ణ, తాతపూడి, మాచర సాగునీటి సంఘం అధ్యక్షులు కె.భవ్య, కొరపాటి జానకిరామయ్య, ఇరిగేషన్ ఇఇ రామకృష్ణ, డ్రెయిన్స్ డిఇ పోచారావు, ఎఇ కృష్ణ, త్రిమూర్తులు, ఎఇ ఎస్ శ్రీను, మండల టిడిపి అధ్యక్షుడు బలవరెడ్డి సత్తిబాబు, పడమరఖండ్రిక పిఎసిఎస్ ఛైర్మన్ పుత్సల శ్రీనివాస్, త్రిపురశెట్టి నాని పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలోని సాంఘిక సంక్షేమ, బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వసతి గృహ సంక్షేమ అధికారులతో వసతి గృహాల నిర్వహణ, పిల్లల ఆరోగ్య భద్రత, సురక్షిత తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పన, పారిశుధ్యం, హెల్త్ ఇన్సూరెన్స్, వంట పాత్రల సరఫరా, కిచెన్, గార్డెన్స్ నిర్వహణపై వంటి అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వసతి సంక్షేమ హాస్టళ్ల పరిధిలోని పంచాయతీ రాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఒక పారిశుధ్య కార్మికుడ్ని పోరుగు సేవలు విధానంలో ఒక్కొక్క హాస్టళ్లకు నియమించడం జరుగుతుందన్నారు. హాస్టల్లో నిర్వహిస్తున్న 18 రిజిస్టర్లు ప్రాపర్‌గా నిర్వహించాలని, స్టాక్ రిజిస్టర్ అనేది అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందని అన్నారు. ఎక్కడా వ్యత్యాసాలు లేకుండా నిర్వహించాలన్నారు. వసతి గృహాలను ఐజినిక్ కండిషన్స్‌లో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సిబ్బందికి ముఖ ఆధారిత హాజరు వేయించాలన్నారు. నాలుగో తరగతి ఉద్యోగులు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. విద్యార్థినీ విద్యార్థుల మౌలిక సదుపాయాలు కల్పన, ఆరోగ్య పరిరక్షణ, హెల్త్ ఇన్సూరెన్స్ అమలు, ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశం లో సంబంధిత శాఖాధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపల్స్, వార్డెన్లు, వైద్య అధికారులు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని సన్నవిల్లికి చెందిన కిడ్నీ బాధితుడు దోనిపాటి సత్యనారాయణకు వైసిపి నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచె రమణారావు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనకు బాధితుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు, కాశి శ్రీరామ్, గొల్లపల్లి వెంకటేశ్వరరావు, పెయ్యల వల్లయ్య, ఏడుకొండలు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వివిధ పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పుణ్యమంతుల రజిని సోమవారం తనిఖీలు నిర్వహించారు. మండలంలోని సిరిపల్లి, వీరవల్లి పాలెం జడ్‌పి ఉన్నత పాఠశాలలను సందర్శించిన ఆమె విద్యార్థులకు పలు సూచనలు చేశారు. బాలికలు ప్రస్తుత పరిస్థితుల్లో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఆడపిల్లల పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులపై దాడులకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ శాతం పరిచయస్తులు, బంధువులే ఉండటం అత్యంత భయంకరమైన అంశమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న రజనీ

జనసేనలో చేరడం హర్షణీయం

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలానికి చెందిన పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరడం హర్షణీయమని ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో సోమవారం వైసిపికి చెందిన పలువురు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలతో ఏర్పడిన రాజకీయ పార్టీ జనసేన అని అన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలు, ప్రజల పట్ల ఉన్న నిజమైన నిబద్ధత తనను ఆకట్టుకుందని, అందుకే తాను జనసేన పార్టీలో చేరినట్లు తెలిపారు. జనసేన కులమతాలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉన్న పార్టీ అని, అన్నారు. వైసిపి నాయకులు పెద్దఎత్తున జనసేనలో చేరడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో నగరం ఎఎంసి ఛైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మి, జనసేన నాయకులు జాలెం శ్రీనివాస రాజా, విళ్ళ సుబ్బారావు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో ఎంఎల్‌ఎ సత్యనారాయణ

పిజిఆర్ఎస్‌కు మూడు అర్జీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో మూడు అర్జీలు వచ్చాయని ఆర్‌డిఒ దేవరకొండ అఖిల ఒక ప్రకటనలో తెలిపారు. చెరువు ఆక్రమణ తొలగించాలని, భూమి ఆక్రమణ తొలగించాలని, మ్యుటేషన్ కొరకు ఇలా మూడు అర్జీలు వచ్చాయన్నారు.

10న అమలాపురానికి తరలిరావాలి

ప్రజాశక్తి - అయినవిల్లి

వైద్య విద్య ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ పత్రాలను అందించేందుకు ఈ నెల 10న అమలాపురంలో జరిగే కార్యక్రమానికి తరలిరావాలని వైసిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటి సంతకాల సేకరణను పూర్తి చేసిన నాయకులు, కార్యకర్తలు ఈ నెల 10న అమలాపురంలో ఏర్పాటు చేసిన ఆ పత్రాలను వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డికి అందించేందుకు నియోజకవర్గం నుంచి ర్యాలీగా తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు చింతలపాటి శ్రీనివాసరాజు, వైసిపి మండల అధ్యక్షులు మేడిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు కుడుపూడి విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూత నివ్వాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వికలాంగులకు చేయూత నిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారని ఎంఇఒలు కె.తాతారావు, విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక భవితా సెంటర్‌లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. భవిత సెంటర్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్న టీచర్లను అభినందించారు. అనంతరం పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న సిజివి, ఆటో డ్రైవర్, విద్యాబుద్ధులు అందిస్తున్న రేవతి, ఐఇఆర్‌టి సునీతను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు కమ్మ వెంకట్రావు, రిటైర్డ్ టీచర్ రాఘవులు, పాఠశాల హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం రాజీలేని పోరాటం

ప్రజాశక్తి - అంబాజీపేట



మహాసభలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ గోపిమూర్తి

ఉపాధ్యాయుల హక్కులు, ఉద్యోగ భద్రతల కోసం రాజీలేని పోరాటం చేస్తామని ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి అన్నారు. సోమవారం స్థానిక నాగమల్లి చెట్టు మోడల్ ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ మండల మహాసభ జరిగింది. మండల శాఖ అధ్యక్షులు ఎన్.సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగం పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలు విద్యాభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటివివిఎపి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పివివి విశ్వప్రసాద్, బి.ఆర్ఎల్ సత్య శ్రీనివాస్,ఎస్ జ్యోతిబసు, ఎంఇఒలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, జివి.రమణ, టి.కామేశ్వరరావు, పి.నారాయణ మూర్తి, ఎం.రాంబాబు, పి.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ ఆయా సమస్యలపై మండలిలో ప్రస్తావిస్తారని ఎంఎల్‌సి బి.గోపిమూర్తి తెలిపారు. గంగలకురు అగ్రహారం హైస్కూల్‌ను ఆయన సోమవారం సందర్శించారు. ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మిడ్డేమీల్స్‌ను రుచి చూశారు. ఆయన వెంట యుటిఎఫ్ నాయకులు జివి.రమణ, ఎం.సూర్యనారాయణ, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సీతారాం, అప్పారి శశికుమార్, రాజు, లక్ష్మీమాణిక్యం తదితరులున్నారు.

కిమ్స్‌లో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు

అమలాపురం : అమలాపురం కిమ్స్ ప్రాంగణంలో 3వ ప్రపంచ తెలుగు మహా సభలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి ఒకటో తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు చైతన్య, కిమ్స్ విద్యా సంస్థల ఛైర్మన్ కెవివి.సత్యనారాయణ రాజు తెలిపారు. సోమవారం కిమ్స్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ తెలుగు మహాసభలు మన తెలుగు ప్రజలందరి పండుగగా భావించి ప్రతి ఒక్కరు ఈ మహా సభలు ఘనంగా జరిపేందుకు తమ వంతు తోడ్పడాలని కోరారు. గత రెండు ప్రపంచ తెలుగు మహాసభలను రాజమహేంద్రవరంలో ఘనంగా నిర్వహించామని, వాటికి తెలుగు ప్రజల నుంచి వచ్చిన విశేష స్పందన వచ్చిందన్నారు. 3 వ ప్రపంచ తెలుగు మహాసభలను అమలాపురం కిమ్స్ ప్రాంగణంలో నిర్వహిస్తామని అన్నారు. అనేక మంది కవులు, సాహితీవేత్తలు, కళాకారులు, రాజకీయ ప్రముఖులను ఈ కార్యక్రమాలకు ఆహ్వానిస్తున్నామన్నారు.

క్రీడా పరికరాల అందజేత

రామచంద్రపురం : స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.66 వేలు విలువైన క్రీడా పరికరాలను అందజేశారు. కాకినాడ రోటరీ క్లబ్ ఛైర్మన్ తడాల వీరవెంకటసత్యనారాయణ, మహేష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ క్రీడా పరికరాలను సమకూర్చారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రభుత్వం చదువుతోపాటు, క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తడాల బుజ్జి, ఎంఇఒ వీర్రెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు బ్లూ స్టార్ రాజా, ఎం.సత్యనారాయణ, డాక్టర్ రేణుక, సర్పంచ్ కోటిపల్లి సుబ్బారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎన్.బలరాం, శివాలయం ఛైర్మన్ గణేష్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - రావులపాలెం

రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డులో సొసైటీ అధ్యక్షుడు కెవి.సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాన్ని ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో నానాటికీ పెరిగిపోతున్న ఖర్చులను తగ్గించడానికి సాంకేతికతను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు శ్రేయస్సుకు ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించిందని తెలిపారు. తక్కువ ఖర్చుతో పంటలను పండించడం, దిగుబడులు ఎలా పెంచాలి, విత్తనశుద్ధి, రుణ సౌకర్యం, మార్కెటింగ్ మొదలైన అంశాల్లో ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం చెబుతున్న పంచ సూత్రాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్‌రాజు, కేతా శ్రీను, జక్కంపూడి బాలాజీ, కొప్పిశెట్టి ప్రసాద్, వ్యవసాయ అధికారి ఎస్.లావణ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బండారు

కేరళ తరహాలో డ్రాగన్ పడవ పోటీలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కేరళ తరహాలో డ్రాగన్ పడవ పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం లొల్ల లాకుల వద్ద సంక్రాంతికి నిర్వహించనున్న డ్రాగన్ పడవల పోటీలు, ఈత పోటీలకు సంబంధించిన బ్రోచర్, పోస్టర్, లోగోలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లొల్ల లాకుల వద్ద ఆత్రేయపురం, తాడిపూడి వంతెన వద్ద గత సంవత్సరం కంటే మిన్నగా డ్రాగన్ పడవల పోటీలు, ఈత పోటీలు, రంగవల్లుల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం కంపెనీని సైతం రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. గత సంవత్సరం జరిగిన డ్రాగన్ పడవల పోటీలు, ఈత పోటీలు అందరినీ ఆకర్షించాయని, పర్యాటకులను ఆకట్టుకున్నాయన్నారు. వాటిని మించేలా ఈ ఏడాది జాతీయస్థాయిలో ఈ పోటీలు జరపాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పేరిట ఈ పోటీలు నిర్వహించేందుఉ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు అందించడానికి ఆలోచన చేస్తుందన్నారు. ప్రభుత్వం, స్పాన్సర్ల సహకారంతో స్థానికంగా ప్రసిద్ధి పొందిన పూతరేకులు, మామిడితాండ్ర, బొబ్బట్లు, కండ్రిగ కోవా, నార్కెడ్‌మిల్లి పచ్చళ్ళు మొదలైన వాటితో ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతం టూరిజం పరంగా కేరళ తరహాలో అభివృద్ధి చెందడానికి ఈ డ్రాగన్ పడవల పోటీలు దోహదం చేస్తాయనిఅన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాకల అధికారులు రాజేంద్రప్రసాద్, వైవివివిఎన్.కుమార్, గంగుమళ్ళ శ్రీనివాస్, కె.వెంకటేశ్వరరావు, విద్యాసాగర్, టిఆర్.రాజేశ్వరరావు, రాము, డేవిడ్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం


చెక్కులను అందజేస్తున్న మంత్రి సుభాష్

నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 17 వందిసి రూ.15,97,244లు మంజూరైన చెక్కులను బాధితులకు మంత్రి సుభాష్ అందజేశారు. సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైద్య ఖర్చులు భారమైన పేదవారికి కొండంత భరోసాగా సిఎంఆర్ఎఫ్ నిలుస్తుందన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవలో లేని అనేక రకాల చికిత్సలకు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఇబ్బంది పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సిఎం సహాయనిధి భరోసాగా నిలుస్తోందని అన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలను సిఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేయించి బాధిత కుటుంబాలకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, టిడిపి నాయకులు కొత్తపల్లి శ్రీనుబాబు, మేడిశెట్టి రవికుమార్, చవ్వాకుల నారాయణమూర్తి, గరికపాటి సూర్యనారాయణ, సలాది రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ను విధిగా ధరించండి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహన చోదకులు హెల్మెట్‌లను విధిగా ధరించాలని అమలాపురం రూరల్ సిఐ డి.ప్రశాంత్‌కుమార్ సూచించారు. సిరిపల్లి-మునిపల్లి ప్రధాన ఆర్ అండ్ బి రహదారిలో సోమవారం ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ వినియోగం వల్ల వచ్చే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. మితిమీరిన వేగంతో వాహనాల నడిపి ప్రమాదాలు కోరి తెచ్చుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పైప్ లైన్ లీకై మంచినీరు వృధాగా పోతుండటంతో సోమవారం మరమ్మతు పనులు చేపట్టారు. స్థానిక 18వ వార్డు మెయిన్ రోడ్డులో పసుమర్తి సిమెంట్ షాపు ప్రాంతంలో తాగునీటి పైపులైన్ పగిలి గత 10 రోజులుగా తాగునీరు వృధా గా పోతుంది. ఈ నేపథ్యంలోనే సంబంధిత శాఖ అధికారుల ఆదేశాలతో సిబ్బంది సోమవారం మరమ్మతు పనులు చేపట్టారు. మరమ్మతు పనులు పూర్తి చేసి మంచి నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎఇ కె శ్రీనివాస్ తెలిపారు.

సర్పంచ్ కుటుంబానికి ఎంఎల్‌సి పరామర్శ

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని హసన్ బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు కుటుంబాన్ని ఎంఎల్‌సి సోము వీర్రాజు సోమవారం పరామర్శించారు. సర్పంచ్ తల్లి నాగమణి ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలోనే ఆయన కుటుంబాన్ని ఎంఎల్‌సి పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ పరామర్శలో ఆకేటి శ్రీకృష, దునే శ్రీను, కల్యాణ్, తోలేటి సూర్య, వాడ్రేవు వెంకటరావు, పుల్లెల రామమూర్తి, తదితరులు ఉన్నారు.